# కన్నీటి ధార

- చక్రవేణు

గోపీకి స్పెషల్ టీచర్ ఉద్యోగం వచ్చింది. పోస్టింగ్ ఆర్డర్ చూసినప్పటి నుంచి చాలా సంతోషంగా వున్నాడు. ఉద్యోగం పొందానన్నదేకాక, తాను పుట్టి పెరిగిన ఊరికి, ఐదవ తరగతి వరకూ చదువుకున్న బడికి టీచర్‌గా వెళుతున్నానన్నదే గోపీకి మరింతగా ఆనందాన్ని కలిగించింది.

గోపి మనసు ఉల్లాసంతో ఉరకలు వేస్తు వుంది. రాత్రి గడిస్తే తెల్లవారి ప్రయాణం. అందుకే సాయంత్రమే అన్నీ సర్దుకొని ప్రయాణానికి సిద్ధమైనాడు.

ఇంట్లో అందరూ నిద్రలోకి జారుకున్నారు. గోపీకి మాత్రం ఎంతకూ నిద్రరావడం లేదు. కళ్ళముందు చిన్ననాటి బడి కదలాడుతూ వుంది.

ప్రకృతి బడిలో పులకరించి పరవశించిన జ్ఞాపకాలు, కలవర పెడుతూ దోబూచులాడుతూ వుంటే, గోపీ మైమరచి గతాన్ని నెమరువేస్తున్నాడు...

పచ్చనిప్రకృతిలో అలరారుతూ, దట్టంగా చెట్లు పెరిగిన ఎత్తైన గుట్ట, గుట్టకింద గుబురు చెట్లమధ్య గువ్వలు గూళ్ళు పెట్టినట్లు ముచ్చటగా కట్టుకున్న పల్లెవాసుల ఇండ్లు.

చుట్టూ చిన్న పల్లెల కన్నింటికీ కేంద్రంగా వున్న ఆ ఊరి పేరు "గట్టుపల్లె". పల్లెలో దాదాపు వంద పైబడి ఇండ్లున్నాయి. ఊరికి తల భాగాన పది ఎకరాల విస్తీర్ణంలో వనమున్నట్టు దట్టంగా కమ్ముకున్న

చింతతోపు. మధ్యలో ఎత్తైన వేపచెట్లు. ఆ చెట్లక్రింద ముచ్చట కొలుపుతూ మూడు బోద కొట్టాలు. ఆ కొట్టాలే పల్లె ప్రాథమిక పాఠశాల.

ఎండ తగలని చింత చెట్లకింద మెత్తటి మట్టిలో, తనివి తీరని ఆటలు. బడికి మైలు దూరంలో గలగల పారే గుండాల ఏరు. వానాకాలమంతా ఏరు పారుతూనే వుంటుంది.

ఎండాకాలం ఏరు పారకున్నా, ఏటి మడుగులో నీళ్ళు నిండుగా ఉంటాయి. మడుగు ఎండిపోవడమంటూ ఎప్పుడూ జరగలేదు. బడి వదులుతూనే మధ్యాహ్నం, పిల్లలు తనివితీరా మడుగులో ఈతాడడం అలవాటు.

ఈతాడడం తల్చుకుంటే మడుగులో చిన్ననాడు జరిగిన సంఘటన గోపీకి తప్పక గుర్తుకొస్తుంది.

ఒక రోజు బడి వదులుతూనే గోపీతో పాటు ఏటి మడుగుకాడికి పరుగుతీశారు.

మగపిల్లలు ఈతాడే మడుగుకాడికి, ఆడపిల్లలు ఎప్పుడూ పొయ్యే వాళ్ళు కాదు. ఆ రోజు విజయ, నీలమ్మ, కళావతి వాళ్ళు వెంటపడినారు.

ఆడపిల్లలు రావడం చూసి వాసు పరుగెత్తుతూ ఉండేటోడు టక్కని కూర్చునేసినాడు.

"ఏమిరా వాసు ఏమైందిరా, రాయేమన్నా కొట్టుకునిందంటరా" గోపీ వాళ్ళు వాసు చట్టూ చేరినారు. కళావతి వాళ్ళు కూడా అక్కడి కొచ్చేశారు.

"ఏందబ్బా ఏమైంది, ఏమైంది" కళావతి గసపోసుకుంటూ పలకరించింది.

కళావతి మాటతోనే వాసు ఎగిరి పైకి లేచినాడు.

"యాడికమ్మే పరిగెత్తెన్నారు ............ మా ఎంబడే రాగాకండి పోండి" వాసు కసురుకున్నాడు.

కళావతి కూడా తక్కువైంది కాదు వాసు కసరింపును లెక్క చెయ్యవేలేదు.

"మా ఇష్టం నీకేమబ్బే ........ కావాలంటే నువ్వే ఎనక్కి పో" అనేసింది.

"అయితే మనం ఎనక్కి పోదాం రాండిరా, వాళ్ళెట్ట పోతారో సూవ్వాంగావి" వాసు కోపంగా అందర్నీ వెనక్కి పిల్చినాడు.

కళావతి కూడా పట్టు పట్టితే మొండిరకం. వాసువాళ్ళు వెనక్కి పోవడానికి సిద్ధమైనారు. ఆ రోజు ఈత ఎగిరిపోయేటట్టుందని, గోపి సర్ది చెప్పడానికి ప్రయత్నించాడు.

"వాళ్ళు ఈత నేర్చుకుంటామంటే నేనే రమ్మన్నాను రానీరేరా పోదాం రండి" గోపి ఆమాట అనేసి ముందుకు కదిలాడు.

కళావతి, విజయ, నీలమ్మ వాళ్ళు గోపీని అనుసరించారు. వారి వెంబడి మగపిల్లలు కూడా కదిలారు.

"వాళ్ళుంటే మనం గుడ్డలిప్పి ఈతాడేదెట్టరా" వాసు కోపాన్ని అణచుకుంటూ అన్నాడు.

"మేముంటే మీకేమి! గుడ్డలిప్పే ఈతాడుకోండి" కళావతి జవాబిచ్చింది.

"నువ్వైతే మా ముందర గుడ్డలిప్పి ఈతాడుతావు కదో" వాసు అన్నాడు.

"దానికేముండాది పావడా గోసి వెక్కోని మునుగుతాను" కళావతి

టకీమని చెప్పింది. "కాబట్టి మొద్దోడా, గుడ్డలన్నీ ఇప్పకుండానే చెడ్డీలతో మునగొచ్చుగాని పోదాములరా!"

వాసును ఎగతాళి చేస్తూ, అందరూ మడుగుకాడికి పోయారు వాసు వాళ్ళను అనుసరించక తప్పలేదు.

మగపిల్లలు ఈతాడుతూ ఉంటే, ఆడపిల్లలు గడ్డమీదనే ఉండి పోయారు. తాడుగాని, బుర్రగాని ఏదీ కట్టుకోకుండా. ఈత నేర్చుకోవాలంటే కష్టం, అవిలేవు కాబట్టి ఆడపిల్లలు గమ్మున చూస్తూ కూర్చున్నారు.

ఈతగొట్టేదైపోయినాక అందరూ గడ్డకొచ్చి చొక్కాలు తొడుక్కుం టున్నారు. వాసు వెనక్కుండా పోయి 'కళావతిని' మడుగులోకి తోసేసి పరుగెత్తినాడు.

కళావతి నీళ్ళల్లో పడగానే అందరూ గట్టిగా కేకలేశారు. దగ్గర్లో ఎవరూ లేరు.కళావతి నీళ్ళల్లో తపతపకొట్టుకుంటూ మునిగిపోతూ ఉంటే, గోపి మడుగులోకి దూకేశాడు.

కళావతిని ఒక చేత్తో పట్టుకుని , ఒక చేత్తో కడుపు కిందకు నీళ్ళు తోసుకుంటూ, గోపి తన బలమంతా ఉపయోగించి, ఈదుకు రావడానికి ప్రయత్నించాడు. కళావతి, గోపి మెడను చుట్టుకొనేసింది. గోపికి బరువెక్కువై ఈదలేకపోయాడు.

ఇద్దరూ మునిగిపోవడం చూసి, పిల్లలు ఏడుస్తూ కేకలు వేసారు. గోపికి ఆ కేకలు చిన్నగా వినపడుతున్నాయి.

"ఈయమ్మి నన్ను కూడా చంపేసింది కదురా దేవుడా, స్వామీ మమ్మల్ని కాపాడు" అనుకున్నాడు.

గోపీకి ఊపిరి తిరగకపోయేటప్పటికి, కళావతి పట్టునుంచి బలంగా చేతులూడబీకి ముందుకు తిరిగాడు. వెంటనే కళావతిని బరబరా

ఈదుకొని దరిమీద కొచ్చాడు.

పిల్లలంతా వచ్చి కళావతిని గడ్డకు పట్టినారు. కళావతికి దరి రాయి తగిలినట్లుంది, గెడ్డం తెగి రక్తం బాగా కారింది. నీళ్ళు దండిగా తాగి కడుపు ఉబ్బింది.

ఈలోపల వాసు ఊర్లోకెళ్ళి, అయ్యవారిని ఇంకా కొందర్ని పిల్చుకుని వచ్చినాడు.

అయ్యవారి చేతిలో బెత్తాన్ని చూసి, దొరికితే కొడతాడనుకొని, మగ పిల్లలంతా ఏటెంబడి దిగువకు పరుగెత్తారు.

ఏటి దిగువకు మూడు మైళ్ళు నడిచాక పెద్ద చెరువులాగా నీళ్ళు కనిపించాయి.

"రేయ్ రామాలమ్మ కాలవ"కాడికి వచ్చినామురోయ్ అంటూ గట్టిగా అరిచి చెప్పాడు సుబ్బరాయుడు.

ప్రతి సంవత్సరం 'రథసప్తమి' పండుగరోజు, వాళ్ళ టీచర్ బడి పిల్లలందరిని రామాలమ్మ కాలువకాడికి వనభోజనానికి తీసుకురావడం అలవాటు. అందుకని రామాలమ్మ కాలవగురించి ప్రతి బడిపిల్లవానికీ బాగా తెలుసు.

"రేయ్ ఎట్టాగొచ్చినాం కదా! రామాలమ్మ గుడికాడ దండం పెట్టుకోని పోదాము, పోదాము రండి"

చలపతి అన్నాడు. అందరూ గుడికాడికి పోయి దండం పెట్టుకున్నారు.

ఏటికి అడ్డం గోడకట్టి నీళ్ళు నిలేసి, కాలవగుండా నీళ్ళు చేలకు పారగట్టుకుంటున్నారు. అక్కడే కాలువ గట్టున 'రాములమ్మ' గుడి కట్టించారు, అందుకని దానికి రామాలమ్మ కాలవ అనే పేరొచ్చింది.



"రేయ్, మన ఐఓరు గుండాలేరు గురించి చెప్పిల్లా, ఈసారి ఎట్లైనా గాని, పెద్దోల్తోపాటు గుండాంకోసకు పోవాలంరా!" గోపి అన్నాడు.

ఏటి గట్టుకెక్కి చేలల్లోనుంచి ఇంటిదారి పట్టినారు. గోపి, వాళ్ళ అయ్యావారు చెప్పిన ఏరు గురించిన మాటలు గుర్తుచేసుకుంటూ నడుస్తున్నాడు.

"సార్‌సార్ ఈ నీళ్ళన్నీ గుండాల ఏటినీళ్ళేకదా! అసలు ఈ ఏరు యాడ్నించి పార్తాందిసార్"

బడిపిల్లలు అయ్యావారినడిగారు. అయ్యావారు 'ఏరు' గురించి చెప్పడం ప్రారంభించాడు.

"ఇక్కడ్నించి చక్కగా మూలగా పడమటి దిక్కు చూడండి. దూరంగా పెద్దకొండలు, అడవి కనపడతా ఉండాది కదా"

"గోపి వాళ్ళ నాయన, ఆ అడవికి పెద్దకదా సార్" అన్నాడొకడు..

"అడవికి పెద్ద అనకూడదు, ఫారెస్టుగార్డు అనాలి, అంటే అడవికి కాపలా అధికారి అన్నమాట" టీచర్ చెప్పాడు.

"సరే వినండి, ఆ కొండలుండాయి కదా! అక్కడ్నించే గుండాలేరు పారుతూ వస్తా ఉందర్రా, ఆ కొండలపైకి పోతే మనకు పెద్ద గుండం కనపడుతుంది"

"గుండం అంటే ఏందిసార్"

"గుండం అంటే చాలా లోతుగా, విశాలంగా వుండి, నిండుకూ నీళ్ళు పార్లుతూ వుంటాయి. ........ అట్లాటి గుండాలు పైన ఏడు గుండాలుంటాయంటరా, ఆ గుండాల నిండుకు నీళ్ళు ఎప్పుడూ ఉంటాయి. అవి పొర్లి పారుతూ ఉండబట్టే, ఈ ఏరు సాగుతూ వుంది. గుండాలల్లో నుంచి నీళ్ళు పారుతున్నాయి కాబట్టి, ఈ ఏటికి

"గుండాలఏరు" అని పేరొచ్చింది.

"ఏడు గుండాలుంటాయంట అంటున్నారు కదా, మీరు చూడలేదా సార్"

"అన్నీ చూడలేదురా!, నేనేకాదు ఎవరూ చూడలేదు. చూడాలంటే నిండుకు నీళ్ళుంటాయి. ప్రక్కనుండి దారి ఉండదు. అసలు ఇంతవరకు గుండాలు ఎండింది లేదు, మాసింది లేదంటారు. శివరాత్రి రోజు గుండాల కోనకు జనమంతా పోతారు కదా!, ఈ సారి మీరు కూడా మీ పెద్దవాళ్ళతో పాటు పోయి చూసిరాండి"

గుండాలేరు గురించి అయ్యవారు చెప్పిన మాటలు గుర్తుకు తెచ్చుకున్నాడు గోపి.

"ఒరేయ్, ఈసారి శివరాత్రికి గుండాల కోనకు పోవాలరా" అన్నాడు గోపి.

"ఓ తప్పకుండా అందరం కలిసే పోదాములేరా" సుబ్బరాయుడు, చలపతి కూడా అంగీకారం తెలిపారు.

వాళ్ళు మాట్లాడుకుంటూ నడుస్తూ, ఎప్పుడొచ్చాశారో తెలీని విధంగా, ఊర్లోకొచ్చేశారు. ఊర్లో కళవాతి వాళ్ళమ్మ, గోపి వాళ్ళమ్మ ఇద్దరూ కొట్లాడుకుంటూ గట్టిగా అరుసుకొంటున్నారు. వాళ్ళ అరుపులు విని గోపి అడుగు ముందుకేయకుండా నిలబడిపోయాడు. సుబ్బరాయుడు, చలపతి మెల్లగా తప్పుకున్నారు.

గోపి వెనక్కి పారిపోదామనుకనేటప్పటికి, కళావతి ఎప్పుడు చూసిందో వెంటనే గోపి దగ్గరకు పరుగెత్తుకొచ్చింది.

కళావతి గెడ్డానికి మందు పూసినట్టున్నారు. దూది కట్టుకట్టారు. 'గెడ్డం బాగా తెగింది కదా, నా పైన కోపంగా వుండాది కదా కళా!'

గోపీ తనదే పొరపాటన్నట్లుగా బాధగా అన్నాడు

"నాకు కోపమే లేదు, నన్ను బతికించింది నువ్వేకదా! అంతా ఆ వాసుగాడే చేసింది" కళ అనింది..

"ఆ మాట నువ్వు మీ అమ్మతో చెప్పలేదా కళా. చెప్పినానన్నట్లు తల ఆడించింది.

"ఐతే ఇంకెందుకు వాళ్ళు అరుసుకొంటున్నారు"

"నీ తప్పేమీ లేదని ఎంతగా చెప్పినా, వాళ్ళింటే కదా ......... అరుసుకోనీరే" కళావతి అనింది.

"మీరెందుకమ్మా, గొంతులు రాపెక్కేటట్టు పిల్లోళ్ళ గురించి అరుసుకుంటున్నారు. వాళ్ళు చూడు, ఇద్దరూ ఎంత బాగా మాట్లాడుకొంటున్నారో"

ఎవరో గోపీని, కళావతిని ఇద్దర్నీ చూపిస్తూ, అరుసుకుంటున్న వాళ్ళతో అన్నారు.

కొట్లాడే తల్లులిద్దరూ, కళావతి, గోపీని చూసి కొట్లాట మానేసి మెల్లగా ఇండ్లలోకి పోయారు.

* * *

ఆ సంవత్సరం శివరాత్రికి 'గోపి' వాళ్ళ నాయన వెంబడి, అక్క, అన్నవాళ్ళతో పాటు గుండాలకోనకు బయలుదేరినాడు.

దారి వెంబడి విప్పచెట్లు, టేకు చెట్లు, శ్రీగంధం, కరక, వెంగ రకరకాల చెట్లున్నాయి. ఆకాశం తగులుతున్నాయా అన్నట్టుగా ఎర్ర చందనం చెట్లు. గోపి వాళ్ళ నాయన చెట్ల పేర్లు వివరంగా చెబుతున్నాడు.

దారిలో చెట్లకు కాసిన ఉసిరికాయలు తింటూ నడుస్తుంటే దప్పిక